ఒట్టు

నదిలో కెరటాలు ఉవ్వెత్తున లేచిపడుతున్నాయి. మాటా మంతీ లేకుండా మౌనంగా కూర్చున్న ఆ తండ్రీ కొడుకుల చేత ఏదో విధంగా పలికించాలని తాపత్రయ పడు తున్నట్లున్నాయా కెరటాలు.

తండ్రి పేరు పేరయ్య.

కొడుకు పేరు వీర్రాజు.

ఇద్దరూ నది ఒడ్డున కూర్చుని నది వంకనే చూస్తున్నారు కానీ కెరటాల హోరు వినడం లేదు. ఇద్దరి మనసుల్లోనూ కెరటాలకు మించిన రభస జరుగుతోంది.

"అయ్యా...నేను స్వతంత్రంగా బ్రతకాలనుకుంటున్నాను" అన్నాడు వీర్రాజు కాసేపటికి.

నదిలో కెరటాల జోరు తగ్గింది. బహుశా ఆ తండ్రీ కొడుకుల సంభాషణ వినాలని కుతూహలపడుతున్నదేమో - నది!

"ఏం..నేను స్వతంత్రంగా బ్రతకడం లేదా?" అన్నాడు పేరయ్య.

"లేదు" అన్నాడు వీర్రాజు.

''నా స్వతంత్రానికేం తక్కువయిందో చెప్పు. తెలుసుకుంటాను''..అన్నాడు పేరయ్య ఉక్రోషంగా.

''నేను నీ కన్నకొడుకుని..నాకు బాగా చదువొచ్చింది. ఇప్పుడు పట్నంలో ఉద్యోగం చేయాలనుకుంటున్నాను. నువ్వెందుకొప్పుకోవు?''

''నిన్ను పట్నం వెళ్ళొద్దనలేదు.ఉద్యోగం చేయొద్దనలేదు. పైగా కష్టపడకుండా ఉద్యోగం కూడా సంపాదించి పెట్టాను..''

''రాజాబాబు దగ్గరే కదా.. అది నా కిష్టం లేదు...''

''ఎందుకని?''

''ఆ యింట్లో వాళ్ల మనుషుల్ని మనుషుల్లా చూడరు. ఉద్యోగమెలాంటిదైనా నేను మనిషిలా బ్రతకాలనుకుంటున్నాను...''

''రాజాబాబు గురించి నీకేం తెలుసునని అలాగనుకుంటున్నావు?''

''ముకుందరావు బాబు నిన్నెలా చూస్తున్నాడో నాకు తెలుసు..''

''అయితే?''

''రాజాబాబుది అచ్చం తండ్రి పోలిక..''

''ముకుందరావు బాబు దగ్గర నా కొచ్చిన లోటేమిటో చెప్పు...''

''నువ్వాయనకు బానిసవు. ఆయనకు వెట్టి చాకిరీచేస్తావు. నువ్వు తప్పు చేస్తే ఆయన నిన్ను 'వెధవా' అని తిడతాడు. నీ వల్ల తనకు మంచి జరిగినా 'వెధవ కానా' అని మెచ్చుకుంటాడు.ఆయన దృష్టిలో నువ్వెప్పుడూ వెధవ్వే!''

''మంచికీ చెడ్డకూ నేనూ నిన్ను వెధవా అంటాను. అది తండ్రీ కొడుకుల అనుబంధం. అంతేకానీ నువ్వు నా దృష్టిలో వెధవ్వి కావు''

''ముకుందరావు బాబు కొడుకు పట్నంలో ఉంటున్నాడు. అక్కడ ఆయనకు పెద్ద మేడ ఉంది.మూడు కార్లున్నాయి.''

''అయితే?''

''అవన్నీ ఆ బాబుకు తండ్రి ద్వారా వచ్చాయి.''

''అవును...''

''నా చిన్నప్పట్నించీ మనం అదే పూరిగుడిసెలో ఉంటున్నాం..''

''అయితే ఏమంటావ్?'' పేరయ్య విసుగ్గా అన్నాడు.

''ముకుందరావు బాబు నిన్ను వెధవా అనడం వరకే తండ్రి..''

''నీ బాధేమిటో నా కర్థం కావడం లేదు. ఈ ఊళ్లో మనకంటే దరిద్రంగా బ్రతుకుతున్న వాళ్లున్నారు. రాజయ్య కొడుకు వెంకటేశు తెలుసు కదా నీకు'' అన్నాడు పేరయ్య.

''తెలుసు....''

''వాడూ నీకు లాగే చదువుకోవాలనుకున్నాడు. కానీ భూషణ రావుగారొప్పుకోలేదని మానేశాడు. మన ముకుందరావు బాబలాంటివాడు కాదు. నీకు చదువొస్తోందని తెలియగానే

ప్రోత్సహించి చదివించారు.''

''నా చదువు గురించి అయిన రభస నాకు గుర్తుంది''.. అన్నాడు వీర్రాజు సాలోచనగా.

వీర్రాజు అయిదవ తరగతిలో క్లాసుకు ఫస్టుగా ప్యాసయ్యాడు. అది తెలిసి అతడి మేనమామ..వీర్రాజును తన వద్ద పట్నంలో ఉంచుకుని చదివిస్తానన్నాడు. అతడికి పట్నంలో కూరగాయల వ్యాపారముంది. వాళ్ళ బంధువుల్లో పట్నం వెళ్ళి బాగుపడ్డ అతి కొద్దిమందిలో అతడొకడు.

ఆశీర్వాదం కోసం పేరయ్య వీర్రాజును ముకుందరావు వద్దకు తీసుకుని వెళ్ళాడు. ముకుందరావు తెల్లబోయి..''నీ కొడుక్కి చదువా?'' అన్నాడు.

''అంతా తమ దయ!'' అన్నాడు పేరయ్య.

''నీ తరువాత ఇక్కడ పని చేయడానికి.. వీడికి ట్రయినింగివ్వవా?'' అన్నాడు ముకుందరావు.

''కుర్రాడికి చదువుకోవాలనుంది బాబూ!'' అన్నాడు పేరయ్య.

ముకుందరావు ససేమిరా అన్నాడు. వీర్రాజు మేనమామ తిరిగి పట్నం వెళ్ళిపోయాడు.

వీర్రాజు చదువు కోసం ఇంట్లో సత్యాగ్రహం చేసి తిండి మానేశాడు. విషయం ముకుందరావు దాకా వెళ్ళింది...

''కుర్రాడి కంత మంకు పట్టేమిటి! నాలుగు తంతేసరి'' అన్నాడాయన.

పేరయ్య వీర్రాజును గొడ్డును బాదినట్లు బాదాడు.

వీర్రాజుకు జ్వరం వచ్చింది. జ్వరంలో కూడా చదువు గురించి ఒకటే కలవరింత.

అప్పటికి వీర్రాజు పేరయ్యకు ఒక్కగానొక్క కొడుకు. పేరయ్య ముకుందరావు దగ్గర భోరున ఏడ్చాడు.

ముకుందరావు హృదయం కరుగలేదు. కానీ భ్రుకుటి ముడతలు పడింది. ఆయన కాసేపాలోచించి...''సరే...వాణ్ణి చదువుకోమను. చదువయ్యేకవాడు మా యింట్లోనే పని చేయాలి''...అన్నాడు.

''ఇప్పుడే ఇంత మొండిగా ఉన్నాడు. చదువయ్యేక వాడు పాలేరు పనికి ఒప్పుకుంటాడా బాబూ!'' అన్నాడు పేరయ్య అనుమానంగా.

''చదువుకున్నవాడి చేత పాలేరు పని చేయించే వంశం కాదురా మాది! వాడికి తగ్గ పనే వాడి కిస్తాను'' అన్నాడు ముకుందరావు.

''తమరు ధర్మ ప్రభువులు....'' అన్నాడు పేరయ్య.

''చదువయ్యేక మా యింట్లో పని చేస్తానని వాడి చేత కాళీమాత ముందు ఒట్టేయించు.'' అన్నాడు ముకుందరావు.

పేరయ్య కొడుకు చేత ఒట్టేయించాడు. ముకుందరావు వీర్రాజు చదువుకు అనుమతి నిచ్చాడు.

ఇప్పుడు వీర్రాజు బియ్యే ప్యాసయ్యాడు. ముకుందరావతణ్ణి రాజాబాబు వద్ద పని చేయమంటున్నాడు.

ముకుందరావు గానీ, రాజాబాబు గానీ.. పేరయ్యనూ, అతడి కుటుంబ సభ్యులనూ మనుషుల్లా చూడరు. అది పేరయ్యకు సహజంగా కనపడవచ్చు. కానీ చదువుకుంటున్న వీర్రాజుకది భరింపశక్యం కాకుండా ఉండేది. తన చదువయ్యేక వాళ్లకు దూరంగా ఎక్కడికైనా పోవాలనుకున్నాడు.

కానీ ఇప్పుడు తండ్రి రాజాబాబు దగ్గర ఉద్యోగం చేయమంటున్నాడు. అందుకే వీర్రాజు తండ్రికి తన చదువుకు ముకుందరావు చేసిన రభస గుర్తు చేసి..''నీ కొడుకును నువ్వే చదివించుకుందుకు అయ్యగారి అనుమతి కావాలి. ఇలాంటి బ్రతుకు బ్రతికేకంటే చావడం మేలు...'' అన్నాడు.

పేరయ్య నవ్వి...''నేను కట్టుబడింది ముకుందరావు బాబుకని నువ్వను కుంటున్నావు. అది సరికాదు. ఈ ప్రపంచంలో ఏ మనిషికీ నేను భయపడను'' అన్నాడు వీర్రాజు.

''ఒక్క ముకుందరావుబాబుకు తప్ప..'' అన్నాడు వీర్రాజు.

''అదీ నిజం కాదు. నాకు కాళీమాతంటే భక్తి. గౌరవం. అందుకే ముకుందరావు బాబుకు కట్టుబడ్డాను. నేను కాళీమాత ముందు ఒట్టేసి ..గొంతులో ఊపిరున్నంత వరకూ ముకుందరావుబాబు కుటుంబాన్ని సేవించుకుంటానని చెప్పాను. మన వంశంలో ఎవరూ యింత వరకూ కాళీమాత ముందు ఒట్టేసి తప్పలేదు. అలా చేయడం క్షేమం కాదనడానికెన్నో నిదర్శనాలున్నాయి...'' అన్నాడు పేరయ్య.

ఆ ఊళ్ళో కాళీమాత గుడి ఉంది. ఆ దేవి మహిమల గురించి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. ప్రామిసరీ నోటుకు మించిన ప్రాముఖ్యత ఆ ఊళ్ళో కాళీమాత ముందు వేసిన ఒట్టుకుంది.

వీర్రాజుకూ కాళీమాత మహిమలపై నమ్మకముంది. చిన్నతనంలో విన్న కథలన్నీ...అతడిని కాళీమాత విషయంలో తర్కానికి అతీతుణ్ణి చేశాయి. ఒకసారి అతడు చిన్నప్పుడు కాళీమాత ముందు ఒట్టేసి అబద్ధం చెబితే...అతడి తల్లికి జ్వరం వచ్చింది. వీర్రాజు హడలిపోయి కాళీమాతను క్షమార్పణ వేడుకున్నాడు. తల్లి జ్వరం తగ్గిపోయింది.

''ఒట్టు విషయం నాకూ గుర్తుంది. అందుకే నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. అయ్యా.. ఎలాగో అలా నాకు ముకుందరావు బాబు కుటుంబం నుంచి విముక్తి లభించేలా చూడు. నువ్వు బ్రతిమాలితే ఆయన వింటాడు...'' అన్నాడు వీర్రాజు.

''అది నా వల్ల కాదు. ఒకసారి ఒట్టేశాక రెండో ఆలోచనుండదు నాకు. చేతనైతే నువ్వే ఆయన్ను మంచి చేసుకో. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఒట్టు మాత్రం తప్పకు...'' అన్నాడు పేరయ్య.

''నా ప్రయత్నం నేను చేస్తాను'' అంటూ లేచాడు వీర్రాజు.

అప్పుడే నదిలో కెరటాల జోరు మళ్లీ హెచ్చింది. ఆ హోరు వీర్రాజును పరిహసిస్తున్నట్లుంది.

★ ★ ★

''నేను కో అంటే కోటి మంది నన్ను సేవించుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. మనం

ఈ వీర్రాజుగాడినెందుకు బ్రతిమాలాలి నాన్నా'' అన్నాడు రాజాబాబు చిరాగ్గా.

``ఏం... ఏమయింది?'' అన్నాడు ముకుందరావు.

``ఆ వెధవ నా దగ్గరకొచ్చి..తను మేనమామకు వ్యాపార వ్యవహారాల్లో చేదోడువాదోడుగా ఉండాలనుకుంటున్నట్లు చెప్పాడు. వాడికి నా దగ్గర పనిచేయడం ఇష్టం లేదు...''

``వాడిష్టంతో మనకు పనేమిటి?'' అన్నాడు ముకుందరావు.

``ఇష్టంలేని వాడితో మనకు పనేమిటి?'' అన్నాడు రాజాబాబు.

``ఉంది. మనం చేస్తున్న వ్యవహారాలకు నమ్మకస్తుడైన మనిషి కావాలి. ఒట్టుకు కట్టుబడ్డ వీర్రాజు మన నుంచి ఆశించేది తక్కువ. నమ్మకంలో కుక్కలు కూడా వాడి సాటి రావు...'' అన్నాడు ముకుందరావు.

రాజాబాబుకు అసలు విషయం త్వరగానే అర్థమయింది.

వెంటనే వీర్రాజుకు కబురు వెళ్ళింది.

వీర్రాజు వచ్చాడు. అతడికి ముకుందరావు తన అంతిమ నిర్ణయం చెప్పాడు. అప్పుడు వీర్రాజు...``అయ్యగారూ!...పోనీ నేనిక్కడే ఉండి మీ పనులు చూసుకుంటాను. నన్ను రాజాబాబుగారి దగ్గరకు పట్నం పంపకండి...'' అన్నాడు.

``ఎందుకని?''

``ఆయన పద్ధతులు సరైనవి కావని పట్నంలో చెప్పుకుంటారు. నేను సాఫీగా బ్రతకాలనుకుంటున్నాను...'' అన్నాడు వీర్రాజు.

``బాగుపడ్డ వాళ్లనూ, పేరు తెచ్చుకున్న వాళ్లనూ చూసి ఓర్వలేని వాళ్ళలాగే చెప్పుకుంటారు. నువ్వు పట్టించుకోకు. నిజంగా తప్పు చేసే వాళ్లను శిక్షించడానికి ఆ పై వాడున్నాడు...'' అన్నాడు ముకుందరావు శాంతంగా.

వీర్రాజు ఆయనతో వాదించలేకపోయాడు.

ముకుందరావు వీర్రాజును, రాజాబాబును తీసుకుని కాళీమాత ఆలయానికి వెళ్ళి అక్కడ వీర్రాజు చేత అన్ని వ్యవహారాల్లోనూ రాజాబాబుకు చేదోడువాదోడుగా ఉంటూ సహకరిస్తాననీ, తన జీవితం అతడి సేవకే అంకితమనీ ఒట్టు వేయించాడు.

``చిన్నప్పుడు నువ్వేసిన ఒట్టు నా కోసం. ఇప్పుడు నువ్వేసిన ఒట్టు... మా అబ్బాయి కోసం... గుర్తుంచుకో!'' అన్నాడు ముకుందరావు చివర్లో.

``కాళీమాతా... ఇదే నీ సంకల్పమా? ఒట్టుతో నాబోటి అమాయకులను అసహాయులను చేయడానికేనా ఈ ఊళ్లో నీవు వెలసింది!'' అనుకున్నాడు వీర్రాజు మనసులో బాధగా.

``నమ్మకస్తుడైన మనిషి దొరికాడు. నీ వ్యవహారాల్లో నీకిక ఎదురు లేదు....'' అంటూ రాజాబాబును అభినందించాడు ముకుందరావు... ఇంటికెళ్ళేక!

★ ★ ★

ఒక్క నెల రోజుల్లోనే రాజాబాబు వ్యవహారాలన్నీ పూర్తిగా తెలుసుకున్న వీర్రాజుకు మతిపోయినట్లయింది. రాజాబాబు దారుణాలు అతడి ఊహలకు మించిపోయాయి.

రాజాబాబు చేతిలో హత్యలు చేసే గూండాలున్నారు. దేశానికి ప్రమాదం కలిగించే

రహస్యాలున్నాయి. అతడు సరఫరా చేస్తున్న మత్తు పదార్థాలు యువతరాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. అతడు సంపాదించి విదేశాలకు చేరవేస్తున్న రహస్యాలు...దేశానికి ప్రమాదం. ఎందరో అమాయక యువతులు అతడి కారణంగా వ్యభిచార గృహాలకు నడిపించబడుతున్నారు.

రాజాబాబు తలచుకుంటే పట్టపగలు బ్యాంకుల్లో దోపిడీ జరుగుతుంది. నడివీధిలో హత్య జరుగుతుంది. మతకల్లోలాలు చెలరేగుతాయి. రాజకీయ నాయకుల స్థితిగతులు మారతాయి.

ఇన్ని చేయగల రాజాబాబుకు తన సహకార మెందుకుకావాలో కూడా వీర్రాజుకర్థమైంది.

అతడు చేస్తున్న పనులన్నీ ప్రమాదకరమైనవి. ఏదో ఒక రోజున ప్రమాదం రాజాబాబు మీదకు మళ్ళవచ్చు. అలాంటప్పుడు తప్పించుకునేందుకు బలి పశువు కావాలి. ఆ బలి పశువు వీర్రాజు!

వ్యవహారాలన్నీ వీర్రాజు పేరు మీద జరుగుతూంటే రాజాబాబు తెరవెనుక ఉంటాడు.

ఇంతవరకూ అలాంటి బలి పశువులిద్దరయ్యారు. ఇద్దరూ పోలీసులకు దొరికాక...మొత్తం రహస్యాలన్నీ బైటపెట్టే స్థితికి వచ్చారు. అప్పుడు వాళ్లు పోలీసు కస్టడీలో ఉండగానే మరణించారు.

రాజాబాబుకు పోలీసు కస్టడీలో ఉండగా తన పేరు బైటపెట్టని నమ్మకమైన బలి పశువు కావాలి. అందుకు వీర్రాజును మించిన వారెవరు?

అయితే రాజాబాబు వీర్రాజును బలి పశువవడానికి అంగీకరించడు. తన మనిషిగా పట్టుబడిన వీర్రాజు తన గురించి ఏమీ చెప్పకపోతే...బయట్నించి విశ్వప్రయత్నం చేసి అతణ్ణి తను రక్షించుకోగలనని రాజాబాబంటాడు. తనకున్న క్లీన్ ఇమేజ్ వీర్రాజును రక్షించడానికి మరింతగా సహకరిస్తుందంటాడతడు.

"ఈ దేశంలోనే కాదు...ప్రపంచమంతా జరుగుతున్నదిదే! తన చుట్టూ ఉన్న పది మొక్కలను చంపి తను మహా వృక్షమవుతుందో మొక్క. మనిషి గొప్పవాడిగా రాణించాలంటే తప్పులు చేయక తప్పదు. అయితే స్వయంగా చేయకుండా తన గొప్పతనానికవసరమైన తప్పులు ఇతరుల చేత చేయించగలిగేవాడే అసలైన గొప్పవాడు. అందుకని గొప్పవాడి చుట్టూ, తప్పులు చేసే వాళ్లుంటారు. వాళ్ళు తప్పులు చేసి గొప్పవాళ్లకు గొప్పతనం పెంచుతారు. తన గొప్పతనంతో వాళ్ళ తప్పులు కాస్తాడు గొప్పవాడు..." అని క్షణం ఆగి "ఇందువల్ల నాకే తప్ప నీకే ప్రయోజనమూ లేదనుకుంటే అది పొరపాటు. నువ్వు పూరిగుడిసెలో పుట్టావు. అసలైన సుఖాల్లో ఒక్కటీ అనుభవంలోకి రాలేదు నీకు. ఇప్పుడు నువ్వు నా గొప్పతనాన్ని పెంచే తప్పులు చేయడం వల్ల నాకులా గొప్పవాడివి కాకపోవచ్చు. కానీ నా అంత వైభవంగానూ జీవించగలవు. అందులోని మజా అనుభవంతోనే తెలుస్తుంది.." అన్నాడు రాజాబాబు.

ఆ మజా ఏమిటో వీర్రాజుకు తెలుసు.

వంగి సలాములు చేసే అనుచరులు, ఆనందాన్నందించే అందాల అతివలు, విదేశీ

మద్యాలు, హంసతూలికాతల్పాలు....

మజా గొప్పదే కావచ్చు. కానీ ఈ మజా నాశ్రయించుకున్న వాడెవడూ తృప్తిగా జీవించలేదు.

ఒక పురుషుడు ఒక స్త్రీ.. కలిసి కుటుంబంగా ఏర్పడి స్వయం కృషితో జీవితానికి బాట వేసుకొనడంలో ఉన్న తృప్తి.. ఆ తృప్తి ఇచ్చే మజా.... అవే ఈ ప్రపంచంలో గొప్పవి. వీర్రాజుకా విషయం తెలియకపోవచ్చు. కానీ అతడలాంటి జీవితం కోసమే కలలు కంటున్నాడు. ఆ కలలకు కేంద్రం అతడి మేనమామ కూతురు గంగ.

గంగ వీర్రాజుకు ఆరో ప్రాణం. తను రాజాబాబుకు అనుచరుడైతే తనకు భార్యగా గంగ సుఖపడదని అతడికి తెలుసు. అలాగని అతడామెను వదులుకోలేడు.

తను కాళీమాత ముందు ఒట్టేశాడు. ఆ ఒట్టు తప్పేడంటే అతడి కుటుంబం సర్వ నాశనమవుతుంది. అందువల్ల రాజాబాబు కతడనుచరుడుకాక తప్పదు.

ఈ విషయం గంగకు చెప్పాలి. ఇటువంటి జీవితం గంగ భరించలేదని తెలియజెప్పాలి. ఆమె లేనిదే తను బ్రతకలేడనీ అయినా కాళీ మాతను అగౌరవపర్చలేడనీ.. గంగ మనసు కరిగేలా చెప్పాలి. అప్పుడు గంగకు వీర్రాజంటే జాలి పుడుతుంది. కష్టమైనా, సుఖమైనా నీతోనే అంటుంది.

ఆ తర్వాత జీవితంలో మళ్లీ ఎప్పుడూ తనను తప్పు పట్టే అవకాశముండదామెకు.

★ ★ ★

నదిలో కెరటాలు ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి. ఆ జంట ఏం మాట్లాడుకుంటోందో వినాలన్న ఉత్సుకత వాటిలో కనబడుతోంది.

వీర్రాజు గంగకు తన భావి జీవితం గురించి వర్ణించి చెప్పాడు. తను నిరసిస్తున్నట్లు మాట్లాడుతూనే ఆమె నాకర్షించే విధంగా చెప్పాడు.

గంగ అంతా విని...''చాలా గొప్ప జీవితం...'' అంది.

''ఈ గొప్ప జీవితంలో మనం విడివిడిగా సుఖపడగలం. కలిసి సుఖపడలేము...'' అన్నాడు వీర్రాజు.

''నిజం చెప్పావు. సుఖపడడం కోసం మనం విడివిడిగానే ఉందాము...'' అంది గంగ.

గంగ చాలా ఖచ్చితంగా ఈ మాటలన్నదని గ్రహించిన వీర్రాజు తెల్లబోయి... ''కానీ గంగా! నువ్వు లేనిదే నేను బ్రతకలేను..'' అన్నాడు.

గంగ ఎక్కువగా చదువుకోలేదు. కానీ తండ్రి కారణంగా ఆమె ప్రపంచం గురించి చాలా తెలుసుకుంది. అందుకే ఆమె చదువుకున్న వారికంటే తెలివిగా మాట్లాడుతుంది.

''కలిసి నీతో కష్టం పంచుకోవడానికైనా నేను సిద్ధమే! విడివిడిగా సుఖపడాలనుకుంటే నీతో కలిసి ఉండలేను...'' అంది గంగ.

''నేనేం చేయను? నువ్వే ఏదైనా ఉపాయం చెప్పు'' అన్నాడు వీర్రాజు అసహాయుడిలా.

''మీ రాజాబాబుకి గుడ్‌బై కొట్టేసేయ్...''

వీర్రాజు నీరసంగా... ''ఏడిసినట్లుంది. అది సాధ్యపడదు'' అన్నాడు.

"ఎందుకని?"

"నేను కాళీమాత ముందు ఒట్టు వేశాను...."

"ఒట్టు తీసి గట్టు మీద పెట్టు..."

"ఏమిటీ?" అన్నాడు వీర్రాజు.

"ఒట్టు తీసి గట్టు మీద పెట్టు..." అంది గంగ మళ్లీ.

"అదెలా సాధ్యం?" అన్నాడు వీర్రాజు.

"నీ చదువు నీకేమీ చెప్పడం లేదా?" అంది గంగ.

మూఢనమ్మకాలనూ, అంధ విశ్వాసాలనూ, అర్థంలేని సంప్రదాయాలనూ.. ఎదిరించడానికి చదువు పనికిరాదని ఈ దేశంలో ఎప్పుడో ఋజువైందన్న విషయం వీర్రాజుకు తెలియదు.

"ఒట్టు గురించి నాకు అనుభవముంది. అనుభవం కూడా ఒక చదువే!" అన్నాడు వీర్రాజు.

"మహా మహా రాక్షసులే ఆ మాతను అగౌరవపర్చలేకపోయారు. నువ్వెంత? నీ భయం ఆ మాత ఆగ్రహం గురించి..మాతను ఆగ్రహించనీ.. అందువల్ల ఏమవుతుంది? నువ్వు... మహా అయితే నీ కుటుంబం నాశనమవుతారు. కానీ అందువల్ల దేశమాతకు ఎంతో లాభం! రాజాబాబు వ్యవస్థకు పట్టిన చీడపురుగు. ఆ పురుగును అంతం చేస్తే.. ఒట్టు తప్పినా ఆ మాత ఆగ్రహించదు. ఆగ్రహించినా ఫలితం నీకు తృప్తినిస్తుంది...."

వీర్రాజు ఆలోచనలో పడ్డాడు. అతడు స్వార్థపు పరిధి నుంచి బైటపడి...ఒట్టు తప్పడంలోని పరిణామాలను కొత్త కోణంలోంచి చూస్తున్నాడు.

"ఒట్టు మీదున్న నమ్మకం నీ తండ్రిని ముకుందరావుకు పెంపుడు జంతువుగా మార్చింది. నీ కుంటుంబాన్ని తరతరాల దాస్యానికి మార్చింది. నీ యింట విప్లవం రావాలంటే ఒట్టు తప్పాలి. అది చదువుకున్న నీతోనే ప్రారంభం కావాలి..."

వీర్రాజు ఆలోచన తీవ్రమైంది.

"ఒట్టు అంటే నీకు భయం.. ఆ భయం స్వార్థానికి సంబంధించినది. నీ స్వార్థం కాళీమాతను అగౌరవపరుస్తోంది. ఆ పవిత్రమూర్తి ఆశయాలకే కళంకాన్నాపాదిస్తోంది. లేకుంటే ఆ దేవత విన్ను రాజాబాబు వంటి దేశద్రోహికి, నరరూప రాక్షసుడికి తొత్తును చేయాలనుకుంటుందా?"

వీర్రాజు కుడి చేయి గట్టు మీద ఆన్చాడు. అతడు ఒట్టును గట్టు మీద పెట్టాడనుకుందో ఏమో ఓ కెరటం విరుచుకుని ఆ చేతి మీద పడింది. ఒట్టును తనలో కలుపుకుంటున్నట్లు క్షణాల మీద నదిలోకి వెనక్కువెళ్లిందా కెరటం.

వీర్రాజు చటుక్కున లేచి నిలబడ్డాడు. అతడి కళ్లు ఎరుపెక్కాయి. వాటిలో విప్లవాన్ని చూసిన గంగ మరి మాట్లాడలేదు. ★

(ఆంధ్ర సచిత్రవార పత్రిక - 30-1-87)